## అంకితం

మీరు మీ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పద్ధతులను ఉపయోగిస్తూ ఉంటారు. ఈ పద్ధతుల ద్వారా అన్ని రకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందా, పద్ధతుల యొక్క లక్ష్యం ఏంటి అనే సందేహం మీకు కలగవచ్చు?

మానవ జీవితంలో రెండు రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయి. మానసికపరమైన సమస్యలు, మనసుకు అతీతంగా ఉండే సమస్యలు. కేవలం మనసులో పుట్టి, మనసులోనే అంతమయ్యే సమస్యలను మీరు ఒక్కరే ఏదైనా పద్ధతిని (Technique) ఉపయోగించుకుని పరిష్కరించు కోగలుగుతారు. అంటే ఈ సమస్యలు తెలిసిన భాగాలైన శరీరం, మనసులో పుట్టి వాటిలోనే అంతమౌతాయి.

కాని సమస్యలు అతీతానికి సంబంధించినవైతే, అంటే తెలిసిన వాటిలో అంటే స్థూలంలో పుట్టి, తెలియకుండా సూక్ష్మంగా రహస్యంగా ఉన్న ఆత్మలో అంతమయ్యే సమస్యలను, మీరు ఒక్కరే మీ అంతట మీరు పద్ధతిని ఉపయోగించుకుని పరిష్కరించలేరు. పద్ధతిని వదిలేసి, మిమ్మల్ని మీరు మీ దైవానికి అంకిత మిచ్చుకున్నప్పుడే, అంటే మీకు మీ దైవం తోడైతేనే అతీతపు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

ఎందుకంటే ఆ సమస్యకు మూలం ఆత్మలో లేదా దైవంలో ఉంది కనుక.

ఇక్కడ పద్ధతి అంటే శ్వాస మీద ధ్యాస, కరిగిపోండి, మూడు వ్యతిరేకాలను ఎంపిక చేసుకోవడం, అలాగే నేను సూచించిన మిగతా వన్నీ. 2004లో నేను పట్టుకున్న మంచిని వదిలేసి, బాహ్యంగా ఉన్న దైవం పట్ల నమ్మకం కోల్పోయి, ఉండి లేనట్టుగా ఉన్న తర్వాతే, నాకు అంతరంలో ఆత్మ సాక్షాత్కారం లభించింది.

మిమ్మల్ని మీరు మీ దైవానికి అర్పించుకోవడమే అంకితమంటే. అంకితమైన తర్వాతే మీరు దైవం దగ్గరకు చేరుతారు. మీరు ఇప్పుడే అంకితమైనట్లయితే, ఏ పద్ధతి అవసరం లేదు. కాని మీరు అంకితం కాలేకపోయినట్లయితే, లేదా మీరు “ఎలా” అంకితమవ్వాలని అడిగినా, లేదా అంకితమవ్వడానికి నేను ఏమి చేయాలి అని అడిగినా, అప్పుడు మీకు పద్ధతి అవసరమౌతుంది.

కోట్ల మందిలో ఒక్కడే, “ఎలా” అని అడగకుండా అంకితమవ్వగలడు. అంటే ఏ పద్ధతి లేకుండా అంకితమవ్వడం అనేది సాధ్యం కాదని కాదు. అది సాధ్యమే, కాని అది కేవలం చాలా కొద్ది మందికి మాత్రమే. ఆ వ్యక్తులు చాలా అరుదైన వారు కారు, దైవాంశ సంభూతులూ కారు. ఎందుకంటే వారు వారి గత జన్మలలో పద్ధతులతో

చాలా కృషి చేసి విసిగిపోయి ఉంటారు. వారు పద్ధతులతో శ్రమించి ఎంత విసిగి పోయారంటే, వాటి వలన అనుకున్నది సాధించలేక అలసిపోయి, విసుగు చెంది నిస్పృహాయ స్థితికి చేరి ఉండవచ్చు. అప్పుడు "ఎలా" అనేది సహజంగా పడిపోతుంది, అప్పుడు పద్ధతులను సహజంగానే వదిలేస్తాడు, ఆ తర్వాతే అంకితం అవ్వగలుగుతాడు.

మీరు ప్రతీదానిని మీ దైవానికి వదిలేసినప్పుడే, అసలైన లోతైన అంకితభావం అనేది సాధ్యమౌతుంది. అప్పుడు మీకు ఏ పద్ధతి యొక్క అవసరం ఉండదు. ఎందుకంటే అదే అన్నింటికంటే ఉత్తమమైన పద్ధతి కనుక. మిమ్మల్ని మీరు, మీ సమస్యలను, మీ భవిష్యత్తుని, మీ సామర్థ్యాలను, మీ సమయాన్ని, మీ అన్ని ప్రయత్నాలను మీ దైవానికి అంకితమిచ్చి విశ్రాంతిగా ఉంటారు.

## ఎలా

మీరు అంకితం కాలేకపోయినట్లయితే, లేదా మీరు "ఎలా" అంకితమవ్వాలని అడిగినట్లయితే, మీరు అంకితమవ్వడానికి అర్హులు కారు, అప్పుడు మీకు పద్ధతి అవసరమౌతుంది. ఎందుకంటే "ఎలా" అంటే అర్ధం, మీరు ఒక పద్ధతిని అడుగుతున్నారని. మీరు ఏ మాత్రం అడగకుండా అంకితమైనట్లయితే, అప్పుడు మీకు ఏ పద్ధతి అవసరం

ఉండదు. కాని అప్పుడు మీరు ఎవరి దగ్గరకీ వెళ్ళరు, మీరు ఏ సమయంలోనైనా మిమ్మల్ని మీరు అంకితం చేసుకోగలరు. ఎందుకంటే అంకితమవ్వడానికి ఏ గురువూ అవసరం లేదు కనుక. గురువు కేవలం పద్ధతిని మాత్రమే భోదించగలడు. మీలో ఉన్న అడ్డులు తొలగి పోవడానికి మాత్రమే సహాయం చేయగలడు.

మీ ప్రతీ అన్వేషణ పద్ధతి కోసమే. మీరు ఎవరి దగ్గరికైనా వెళ్ళి అడిగినప్పుడు, మీరు ఒక పద్ధతిని అడుగుతారు. లేదా మీరే తగ్గించమని అడుగుతారు. అన్వేషణ లేకుంటే మీరు ఎక్కడికి వెళ్ళవలసిన అవసరం లేదు. మీ అన్వేషణనే సూచిస్తోంది మీకు పద్ధతి యొక్క అవసరం చాలా ఉందని. పద్ధతుల ద్వారా మీరు ఒక స్థితికి చేరిన తర్వాతే, మీరు సహజంగా అంకితమయ్యే దశకు చేరుకుంటారు. లేదా పద్ధతులను అభ్యాసం చేయడం మానేసి, మీరు కేవలం విశ్రాంతిగా ఉంటారు అంతే, కాని కేవలం విశ్రాంతిగా ఉండడం అనే స్థితి కూడా పద్ధతుల ద్వారానే సాధ్యమౌతుంది.

మీ అంతట మీరే అతీతపు సమస్యలను పరిష్కరించుకోవాలని చూస్తే, పద్ధతులన్నీ మీకు వ్యతిరేకంగా తయారవుతాయి. అంటే రక్షించిందే భక్షిస్తుందన్నమాట. ఎందుకంటే పద్ధతులు కేవలం మీరు అంకితమయ్యే

స్థితికి, అంటే విశ్రాంతిగా ఉండే స్థితికి మాత్రమే తీసుకెళ్ళగలుగుతాయి కనుక. అతీతపు సమస్యలకు కావలసిన పరిష్కారం పద్ధతుల వద్ద లేదు కనుక.

పరివర్తనం టాపిక్ లో చెప్పినట్టు సమస్యలో ప్రశాంతంగా ఉంటే పరిష్కారం లభిస్తుంది. కాని ప్రశాంతంగా ఉన్నా కూడా సమస్యకు పరిష్కారం లభించకపోతే, అర్ధం చేసుకోండి ఇది అతీతమైన సమస్య అని. కనుక మీకు మీ దైవం తోడైతేనే ఈ అతీతమైన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

## ప్రయత్నం

మీకు ఏ సమస్య వచ్చినా ముందు మీకు ఉన్న జ్ఞానంతో ప్రయత్నిస్తారు. కాని మీరు ఎంత ప్రయత్నించినా ఫలితం రాకపోతే అప్పుడు మీకు తెలిసిన జ్ఞానం పట్ల మీకు ఉన్న విశ్వాసం సన్నగిల్లుతుంది. అంటే మీ అహం మీద దెబ్బపడుతుందన్న మాట. దీని వలన మీకు మరియు మీ మనసుకు మధ్య ఉన్న బంధం కూడా సన్నగిల్లుతుంది.

ఇంత వరకు మనసే దైవం అని భావించి దానితోటే మిమ్మల్ని మీరు గుర్తించుకున్నారు. కాని ఎప్పుడైతే మనసు చెప్పింది చేయడం వలన మీకు ఫలితాలు రాలేదో, అప్పుడు మీరు మనసును వదిలేసి దైవం వైపు అడుగులు వేయడం మొదలుపెడుతారు. ఇలా జరిగినప్పుడే మీరు సహజంగా

దైవానికి ఆధీనమై మీ సమస్యను దైవానికి అర్పిస్తారు. అప్పుడే మీకు ఫలితాలు వస్తాయి.

కాబట్టి నేను సూచించిన పద్ధతులు లేదా సాధనలు చేయడానికి మీరు ఇంకా తీవ్రంగా ప్రయత్నించండి, ప్రయత్నాలను ఇష్టంతోటి చేయండి. ఇలా చేయడం వలన మీరు మనసు నుంచి త్వరగా బయటికి వస్తారు. ఇలా ప్రయత్నాలు చేయడం వలన మీకు ఉన్న అహం రూపాలు కూడా కరిగిపోతాయి. ఇక్కడ ప్రతి ఆలోచన కూడా అహం రూపమేనని గ్రహించండి. ఆలోచనల ద్వారా ఫలితాలు రాకుంటే మీరు వాటికి ప్రాధాన్యతనివ్వరు. ఇలా మీ సహకారం లేకపోవడం వలన ఆలోచనలు కరిగిపోతాయి.

ప్రయత్నం ద్వారా ఫలితాలు రావు అని అనుభవం ద్వారా తెలుసుకుని, కొత్త సమస్య వచ్చినప్పుడు మీరు ఏ మాత్రం ప్రయత్నించకుండా దైవానికి ఆధీనమైనానని భావిస్తే మీకు ఫలితం రాకపోవచ్చు, ఎందుకంటే దానికి సంబంధించిన అహం రూపాలు కరగలేదు కనుక.

ఇక్కడ మన లక్ష్యం మన అహం రూపాలను కరిగించి, దైవంతో ఒకటవ్వడం. మీరు ప్రయత్నించకుండా దైవం వైపు అడుగులు వేస్తే మీకు మనసు యొక్క సహకారం లభించదు, అది ఎప్పుడూ నా మాట విను అని గోల

చేస్తూనే ఉంటుంది. ఎందుకంటే మనసు తన దగ్గర ఉన్న పాత జ్ఞానభారాన్ని తగ్గించుకోవాలని అనుకుంటోంది కనుక.

కాబట్టి మీ ప్రయత్నాలను ఇంకా ద్విగునీకృతం చేస్తూ, అహం రూపాలను కరిగించి, మనసు యొక్క సహకారంతోనే దైవానికి ఆధీనమవ్వండి. దైవం సహకారంతో మీరు పొందిన ఫలితాలను మనసు కాడా ఆనందిస్తుంది. ఇలా చేస్తేనే మీలోని అన్ని భాగాల మధ్య సమన్వయం ఏర్పడుతుంది. కాబట్టి మీ ప్రయత్నాలను మరింత పెంచి, విశ్రాంతి స్థితికి చేరమని సలహా ఇస్తున్నాను.

మొదట్లో, మీ అంతట మీరు దేనినైనా ప్రయత్నించి, సాధించ లేకపోయినప్పుడు మీరు నిరుత్సాహపడతారు, నేను దేనికీ పనికి రానని బాధ పడతారు. అప్పుడు మీరు అయిష్టంగానే సమస్యను మరియు దానికి సంబంధించిన నమ్మకాలను వదిలేసి దైవానికి అంకితమవుతారు. కాని ఇలా చేయడం వలన మీకు ఫలితాలు వస్తాయి. తర్వాత సమస్యకు మానసిక స్థాయిలో ఇష్టంతో ప్రయత్నించి ఫలితం రాకపోతే, వెంటనే మీ అంతట మీరే ఇష్టంగా సమస్యతో పాటు మిమ్మల్ని కూడా దైవానికి అర్పించుకుని విశ్రాంతిగా ప్రశాంతంగా ఉంటారు.

ఇంకా చెప్పాలంటే అంకితమయ్యే సమయం కోసం ఎదురు చూస్తారు.

ఎందుకంటే ఇలా విశ్రాంతిగా ప్రశాంతంగా ఉన్నప్పుడే మీ ఒంటరితనం మాయమౌతుంది కనుక, మీ దైవంతో మీరు కలవాలనే కోరిక సంభవమౌతుంది కనుక, పరమానందాన్ని పొందుతారు కనుక. అంటే శరీరంలో మనసులో హృదయంలో ఇలా తెలిసిన అన్నింటిలో విశ్రాంతిగా ఉండడానికి ఎంత ఆహారం అవసరమో, ఎంత పని అవసరమో అంతే చేస్తారు. ఇలా విశ్రాంతిగా ఉన్నప్పుడే మీ శాశ్వత భాగస్వామి అయిన పరమాత్మతో మీరు ఏకమౌతారు.

మీ మనసు చెప్పినవన్నీ ప్రయత్నించిన తర్వాతే మీరు అంకితమవ్వగలరు. అలసిపోయి ఏమీ చేయలేని పరిస్థితికి చేరినప్పుడే, అన్ని దారులు మూసుకుపోయినప్పుడే, అన్నింటిని వదిలేసి మనసు విశ్రాంతి తీసుకుంటుంది. అప్పుడే మీరు ప్రశాంతంగా హాయిగా విశ్రాంతిగా ఉంటూ ఆత్మకు అంకితమవ్వగలరు, ఆ తర్వాతే మీకు ఫలితం లభిస్తుంది.

## ఉన్నత చైతన్యం

మీరు దైవానుభూతిని పొందాలనుకుంటే, మీరు ప్రయత్నించాలి. కాని ఆ ప్రయత్నాలు మీకు దైవానుభూతిని ఇవ్వలేవు. ఆ ప్రయత్నాలు మిమ్మల్ని దైవం దగ్గరకు చేరువయ్యేలా చేస్తాయి. ఆ ప్రయత్నాలు మిమ్మల్ని దైవానుభూతి పొందడానికి

కావలసిన పరిస్థితిని సృష్టిస్తాయి. ప్రయత్నం ద్వారా ఉన్నత చైతన్యానికి మీరు అందుబాటులో ఉంటారు. మీ ప్రయత్నాలన్నీ అయిపోయిన తర్వాతే, మీరు ఎలాంటి ఘర్షణ లేకుండా విచ్చుకుని ఉంటారు. అప్పుడే ఉన్నత చైతన్యం పని చేయడానికి మీరు సహకరిస్తారు.

ఎప్పుడైతే మీరు ఘర్షణ లేకుండా ప్రక్రియ జరగడానికి అనుమతిస్తారో, అప్పుడే ఉన్నత చైతన్యం పనిచేయడం ఆరంభిస్తుంది. అప్పుడు శరీరం మరియు మనసు, ఉన్నత చైతన్యం యొక్క సహకారంతో వాటినవి బాగు చేసుకుంటాయి. మీరు ఈ ప్రక్రియకు ఏ మాత్రం అడ్డుపడకుండా, కేవలం ఆ సమస్యకు సంబంధించిన లక్షణాలను అనుభవిస్తూ వాటికి సహకరిస్తారు, ఆ తర్వాతే ఫలితం లభిస్తుంది. కాబట్టి ఫలితం రావాలని సంకల్పించిన తర్వాత, మీ మొదటి లక్ష్యం ప్రయత్నించడమే. ఆ తర్వాత లక్ష్యం  ప్రశాంతంగా అంకితమై దైవానికి సహకరించడం, ఆ తర్వాతే మీకు ఫలితం లభిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోండి.

ఇది ఎలాంటిదంటే, మీరు అన్నీ తలుపులు మూసేసుకుని ఒక గదిలో కూర్చున్నట్టు. సూర్యుడు బయట ఉన్నాడు, కాని మీరు చీకట్లో ఉన్నారు. సూర్యుడు లోపలికి రావడానికి మీరు

ఏమీ చేయలేరు. కాని మీరు కేవలం తలుపులను తెరవగలిగితే చాలు, మీ గది సూర్యుడికి అందుబాటులో ఉంటుంది. మీరు ఇన్ని రోజులు సూర్యుడి ప్రభావం మీపై పడకుండా అడ్డులను నిర్మించుకున్నారు. కాని మీరు ఇప్పుడు తలుపులను తెరిస్తే, సూర్యరశ్మి లోపలికి ప్రవేశిస్తుంది.

మీరు నిజానికి సూర్యరశ్మిని లోనికి తీసుకురావటంలేదు. మీరు కేవలం అడ్డులను మాత్రమే తొలగిస్తున్నారు. వెలుతురు దానంతటఅదే లోనికి వస్తుంది. దీనిని లోతుగా అర్థం చేసుకోండి: దైవానుభూతిని పొందడానికి మీరు సూటిగా ఏమీ చేయలేరని; కాని దైవాన్ని దాచడానికి, దైవం మీదగ్గరికి చేరకుండా ఉండడానికి మీరు ఎన్నో అడ్డులను సృష్టించవచ్చు. ఎంత మంచివైనప్పటికి - ఇక్కడ అన్ని ఆలోచనలు, అన్ని నమ్మకాలు, అన్ని అభిప్రాయాలు, అన్ని గుణాలు మరియు అన్ని భద్రతా ప్రమాణాలు కూడా అడ్డులేననే విషయాన్ని గుర్తుంచుకోండి. కాబట్టి ఏ ఒక్క ఆలోచనను పట్టుకున్నా మీకు మరియు మీ దైవానికి మధ్య అడ్డు ఏర్పడుతుందనే విషయాన్ని గ్రహించండి.

ఇలా ఎందుకు జరుగుతుందంటే, దైవం నిర్గుణుడు, నిరాకారుడు, అన్నింటికీ అతీతుడు. మీరెప్పుడైతే ఆలోచనను పట్టుకుంటారో, అప్పుడు

మీకు ఆకారం ఏర్పడుతుంది. ఉదాహరణకు మీరు మంచి పని చేసిన తర్వాత నేను మంచి వాడినని భావిస్తారు. అంటే మీరు ఇక్కడ మంచిని పట్టుకున్నారన్నమాట. అప్పుడు మీకు మంచి రూపం ఏర్పడుతుంది. కాని దీని వలన మీరు దైవాన్ని కోల్పోతారు. ఎందుకంటే దైవం స్వచ్ఛమైన వాడు కనుక. అందువలన మంచి చేసిన తర్వాత అక్కడే ఆగకుండా, దానినే తలుచుకుంటూ ఉండకుండా, దాని వలన ఏర్పడ్డ అనుభూతిని ఇష్టంగా అనుభవించి, దానినే ఉపయోగించుకుని అతీతానికి చేరి దైవంతో కలవండి.

కాబట్టి ప్రయత్నాల ద్వారా, పద్ధతుల ద్వారా, గతంలో మీరు సృష్టించిన అడ్డులను మాత్రమే మీరు తొలగించ గలుగుతారు, మీరు మూసివున్న తలుపులను మాత్రమే తెరవగలుగుతారు. తలుపులు తెరుచుకున్న తక్షణమే వెలుతురు లోపలికి ప్రవేశిస్తుంది, ఆ దైవ కిరణాలు మిమ్మల్ని తాకి మిమ్మల్ని పరివర్తనం చెందిస్తాయి. కాబట్టి ప్రయత్నాలన్నీ అడ్డులను తొలగించడానికే గాని దైవానుభూతిని పొందడానికి కాదనే విషయాన్ని ఎల్లప్పుడూ మదిలో ఉంచుకోండి.

కొత్తవి మీలో ప్రవేశించకుండా మీరు పరిధులను విధించుకోవడం వలననే

పద్ధతి అవసరం అవుతోంది. మీరు పద్ధతులను ఉపయోగించుకుని మీలోని పరిధులను కొద్ది కొద్దిగా తొలగించండి. అప్పుడే అంతరంలో స్వచ్ఛత, సహజత్వం అనేది వృద్ధి చెందుతుంది.

మీరు ప్రతీదానిని మీ దైవానికి అంకితం ఇచ్చినట్లయితే, అప్పుడు ఏ ప్రయత్నం ఉండదు, మీరు చేయవలసినది ఏమీ ఉండదు. మీరు కేవలం ప్రవహిస్తారు. మీరు ప్రతీదానిని చాలా లోతుగా విడుదల చేయడంలో ఉంటారు. మీ జీవితంలో సంఘటనలు జరుగుతాయి, కాని మీరు వాటి కోసం ఏ ప్రయత్నం చేయరు, కనీసం మీరు వాటి కోసం ఏ అన్వేషణ చేయరు. అవి జరిగినా జరగకున్నా మీరు ఎల్లప్పుడూ తృప్తిగా ఉంటారు. ఎంపిక అనేదే మీకు ఉండదు. దైవం అనుకున్న ప్రకారం జరుగుతుంది, మీకు ఎలాంటి అంచనాలు గాని, ఆందోళనలు గాని ఉండవు.

దైవం ప్రవహిస్తూ ఉంటాడు, దానిలో మీరూ ప్రవహిస్తూ ఉంటారు. మీకు ఎక్కడికో చేరాలనే లక్ష్యం ఉండదు, ఎందుకంటే లక్ష్యం ఉంటే ప్రయత్నం ప్రవేశిస్తుంది కనుక. ఆఖరికి దైవం దగ్గరకు చేరాలన్న మీ లక్ష్యాన్ని కూడా వదిలేయాలి. మీరు ఎక్కడికో వెళ్ళవలసిన, ఎక్కడికో చేరవలసిన ప్రదేశం గాని, ఏ లక్ష్యం గాని ఉండదు, మీరు సాధించవలసినది ఏదీ ఉండదు.

మీరు దేని గురించి అన్వేషించరు వేచి ఉండరు. మీరు దేనిని కాంక్షించరు, దేని మీదా ఆశపెట్టుకోరు. దైవమే నడిపిస్తున్నాడు, నాకు కావలసినది దైవమే సమకూరుస్తాడు అని విశ్వసిస్తూ, మీరు ప్రతీదానిని మీ దైవానికి అంకితమిస్తారు. ఆ తర్వాత మంచి-చెడు అనుభవాలన్నింటినీ దైవ ప్రసాదంగా భావిస్తూ అనుభవిస్తారు.

అంకితమవ్వడం అంటే మీ కంటే ఉన్నతమైన మీ దైవానికి మిమ్మల్ని మీరు అర్పించుకోవడం. అప్పుడు జీవితం మీ అదుపులో ఉండదు. అప్పుడు దైవం మిమ్మల్ని కబ్జా చేస్తాడు, మిమ్మల్ని తన అదుపులోకి తీసుకుంటాడు. అప్పుడు మీరు అనుకున్నదిశలో మీ జీవితం పయనించదు. మీరే దైవంగా పరివర్తనం చెందడానికి కావలసిన పరిస్థితులను దైవం సృష్టిస్తాడు. భవిష్యత్తు అనేది అగమ్యగోచరంలా ఉంటుంది.

మీకంటే ఉన్నతమైన మీ దైవంతో మీరు పయనిస్తే, మీరు అభద్రతా భావంతో మరియు భయంతో ఉంటారు. ఎందుకంటే మీ ఊహకు అందని విధంగా దైవ నిర్ణయాలు ఉంటాయి కనుక, ఆ నిర్ణయం యొక్క విలువ మీకు కొంత సమయం గడిచిన తర్వాతే అర్థం అవుతుంది. కాబట్టి మొదట్లో దైవంతో ఉండడం అనేది కష్టంగానే ఉంటుంది, కాని ఆ తర్వాత ఈ స్థితిని కూడా ఎంజాయ్ చేస్తారు.

ఎందుకంటే మీలో విశాలమైన దృక్పథం మేల్కొనడమే కాకుండా, మీ పట్ల కూడా మీకు విశ్వాసం పెరుగుతుంది.

మీరు ఇలా జీవించడానికి ఇష్టపడకపోతే, మీ దైవంతో జీవించాలనే కోరికను వదిలేయడమే మంచిది. అలాగే బాహ్యంగా మీ కంటే ఉన్నతమైన వారితో జీవించకుండా మీ కంటే అల్పులతో జీవించండి, అప్పుడు మీరు వారికి ఒక మాస్టర్‌గా ఉండగలుగుతారు మరియు మీరు మీ లక్ష్యాన్ని ముందే నిర్దేశించుకోగలుగుతారు. మీరు ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు, కాని దానిలోంచి ఏ కొత్తదనము మీకు లభించదు. అప్పుడు మీ జీవితాన్ని మీరు వృధా చేసుకున్నట్టే అవుతుంది.

దైవసాంగత్యంతో జీవించడం అనేది ఒక నదీ ప్రవాహంలా ఉంటుంది. దానికి ఒక మార్గాన్ని నిర్దేశించడం అనేది సాధ్యం కాదు. మీరు అనుసరించడానికి ఖచ్చితమైన సూచనను ఎవరూ ఇవ్వలేరు. కాబట్టి సజీవంగా చురుకుగా ఉండండి. దైవం మిమ్మల్ని ఏవైపు తీసుకువెళ్ళినా దాని పట్ల విశ్వాసంతో ఉండండి. న్యూ ఎనర్జీ జీవితం అంటే దైవ ప్రవాహం మీద విశ్వాసాన్ని ఉంచడం. దైవం మీకు మార్గదర్శకుడిగా ఉండడానికి అనుమతించండి. మిమ్మల్ని ఉన్నత చైతన్యం వైపు తీసుకెళ్ళడానికి దైవాన్ని అనుమతించండి. ఆ మార్గంలో ఎప్పుడూ

మీరు మేల్కొని ఎరుకలో ఉండండి, ఎందుకంటే ఆ దారిలో ఎదురయ్యే వాటిని మిస్ అవుతారు కనుక.

న్యూ ఎనర్జీ జీవితం, కేవలం లక్ష్యానికే ప్రాధాన్యతనివ్వదు. ఆ మార్గంలో ఎదురయ్యే వాటికి కూడా ప్రాధాన్యతను ఇస్తుంది. మీరు ఇష్టంతో ఈ మార్గంలో పయనిస్తే, మార్గంలో పయనిస్తున్నప్పుడే ఆనందాన్ని పొందుతారు. ఎందుకంటే మీ దైవమే మీకు తోడుగా ఉండి మార్గాన్ని నిర్దేశిస్తాడు కనుక. నదిలాగే మీ జీవితంలో కూడా ఎన్నో ఊహించని మలుపులు, ఎదగడాలు, పడిపోవడాలు, క్లైమాక్స్‌లు, తెలియని ప్రదేశంలోకి పయనించడాలనేవి ఉంటాయి. ఈ అనుభవాల ద్వారా కూడా మీకు ఎంతో ఆనందం లభిస్తుంది.

కాబట్టి మార్గంలో కూడా ఎరుకతో మేల్కొని ఉండండి. దివ్యానందం చివరిలోనే లభించేది కాదు, మార్గంలో కూడా లభిస్తుంది. అది ఎప్పుడూ ఎదుగుతూనే ఉంటుంది. నదే, సముద్రమంత అపరిమితంగా తయారవుతుంది. ఇక్కడ నది కేవలం సముద్రంతో కలవడం లేదు, నదే సముద్రంగా ఎదుగుతుంది. అంటే అనుభవాలలో జీవాత్మయే ఎరుకలో ఉండి పాల్గొని వాటిని అనుభవిస్తూ, ఎదుగుతూ విస్తరిస్తూ ముందు ఆత్మగా, ఆ తర్వాత పరమాత్మగా పరివర్తనం చెందుతాడన్నమాట. ఇది ఎప్పుడు

సాధ్యమౌతుందంటే - మీరు ఉన్నతమైన అనుభవాలలో, ఎరుకలో ఉండి విశ్వాసంతో పయనించి, వాటికి అతీతంగా చేరినప్పుడే. అవును ఈ మార్గం రిస్క్‌తో కూడుకున్నదే అయివుండవచ్చు. కాని ఇలా చేస్తేనే మీరు అద్భుతాలను అన్వేషించగలుగుతారు.

కాబట్టి సృష్టికర్తగా ఉంటూ ఎప్పుడూ ఉన్నత చైతన్యంలోకి ప్రవేశించడానికి సాహసించమని సలహా ఇస్తున్నాను. కాని నా సలహాను ఆధారం చేసుకుని త్వరగా ఏ నిర్ణయం తీసుకోకండి, ఎందుకంటే ఏది జరిగినా దానికి పూర్తి బాధ్యులు మీరే అవుతారు కాబట్టి.

** ఈ లింక్‌ని క్లిక్ చేసి ఆడియోలు వరుసగా వింటే మరియు టాపిక్స్ చదివితే, మీకు న్యూఎనర్జీ-అద్వైతం కాన్సెప్ట్ స్పష్టంగా అర్థమవుతుంది.

http://darmam.com/important-topics.html